క్లుప్తంగా

అగ్ని ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం



పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం శివారు కప్పలవారిపాలెం గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వస్వం కోల్పోయిన పోలిరెడ్డిని బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ పరంగా గృహ నిర్మాణం చేసుకునేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. బాధితునికి కొంత నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ లీలా శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు కూసంపూడి దేవేంద్రరాజు, కుంతం ప్రసన్నరాజు, సీతయ్య, శివారెడ్డి, గంగరాజు, కోటిరెడ్డి తదితరులు ఉన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం అందజేత



రేపల్లె రూరల్: పార్టీ కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండలంలోని విశ్వేశ్వరం గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త జీవన్ ఇటీవల రహదారి ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్నాడు. సమాచారం తెలుసుకున్న ఎంపీ మోపిదేవి మంగళవారం జీవన్‌ను పరామర్శించి వ్యక్తిగతంగా రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ ఉన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులకు మేలు

రేపల్లె రూరల్: విద్యార్థులలో సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు విజ్ఞాన ప్రదర్శనలు ఎంతగానో ఉపయోపడతాయని రామకృష్ణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కుర్రా అపర్ణ అన్నారు. పట్టణంలోని రామకృష్ణ పబ్లిక్ స్కూలులో మంగళవారం నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. చదివిన దానికంటే చూసి నేర్చుకున్న అంశాలే ఎక్కువగా గుర్తుంటాయని, అటువంటి పాఠ్యాంశాలను విజ్ఞాన ప్రదర్శనలో చూసి నేర్చుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. పాఠశాల విద్యార్థులు వివిధ రకాల ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ కుర్రా మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

వేమూరు: సార్వత్రిక ఎన్నికలకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి వసంత రాయుడు కోరారు. తహసీల్దారు కార్యాలయంలో స్థానిక రాజకీయ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం కోసం వివిధ పార్టీల నాయకులు వాహనాలు అనుమతి కోసం ఆన్‌లైన్ ద్వారా చలానాలు పొందాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ యాప్ ఏర్పాటు చేసిందన్నారు. రాజకీయ నాయకులంతా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఎన్నికల కమిషన్ ఎన్నికల కోడ్ ప్రకటించిన తర్వాత అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొల్లిముంత ఏడుకొండలు, మైనేని మురళీ, తోడేటి సురేష్, వేమూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు తహసీల్దారులు కిరణ్, ముని లక్ష్మి, డి కవిత, బాలాజీ విశ్వనాథ్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు

పొన్నూరు: వరిగడ్డి రవాణా చేసే ట్రాక్టర్ డ్రైవర్లు సమయ పాలన పాటించకుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ పి.భాస్కర్ హెచ్చరించారు. మంగళవారం ట్రాక్టర్ డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ఉదయం 6 గంటల లోపు, రాత్రి 10 గంటల తర్వాత పట్టణంలోని ప్రధాన రహదారిలోకి వరిగడ్డి ట్రాక్టర్లను తీసుకురావాలని డ్రైవర్లకు సూచించారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

ప్రత్తిపాడు: పద్ధాలుగేళ్ల లోపు చిన్నారులను ఎన్నికల ప్రచారానికి వినియోగించవద్దని ఆర్డీవో పి.శ్రీకర్ ఆదేశించారు. ప్రత్తిపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల్లో మార్పులు, ఓటర్ల జాబితాకు సంబంధించి వచ్చిన అర్జీలపై తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత రాజకీయ పార్టీలు పాటించాల్సిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి, నోటిఫికేషన్ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలను ఆర్డీవో నాయకులకు తెలియజేశారు.

వైఎస్సార్ సీపీ ఆవిర్భావం చారిత్రాత్మకం

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



జెండా ఆవిష్కరణ వేడుకలో స్థానిక నాయకులతో రఘుపతి



పిట్టలవాని పాలెంలో కేక్ కత్తిరిస్తున్న బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి

రేపల్లె రూరల్: రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ జెండాను ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పేదరిక నిర్మూలన దిశగా సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఆనాడు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి మరణానంతరం ఆయన కుటుంబం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన కుట్రలు, కుయుక్తులు రాష్ట్ర ప్రజలు మరువలేరన్నారు. తండ్రి ఆశయాలను నెరవేర్చాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీని స్థాపించి ప్రజల కష్టాలను స్వయంగా తెలుకున్నారన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ప్రజలతో మమేకమవుతూ ఆయన ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పదవి హోదా కాదు.. రాష్ట్ర ప్రజల కష్టాలు తీర్చే బృహత్తర బాధ్యత అని గుర్తించి నిరంతరం ప్రజల కష్టాలను తీర్చే క్రమంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న నాయకుడు సీఎం జగన్ అని కొనియాడారు. రానున్న రోజుల్లో రాష్ట్రాన్ని సుభిక్షంగా మార్చే దిశగా సీఎం వైఎస్ జగన్ వేస్తున్న ప్రతి అడుగు సఫలీకృతమవుతుందన్నారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, మార్కెట్‌యార్డు చైర్మన్ దేవగిరి సాంబశివరావు, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు, కార్పొరేషన్ల డైరెక్టర్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పిట్టువారిపాలెంలో..

పిట్టువారిపాలెం గ్రామంలో గ్రామ సర్పంచ్ యేత్రి అశ్వినిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి గ్రామంలోని వైఎస్సార్ విగ్రహాలకు పూలదండ వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో పార్టీనాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఖాజీపాలెం, భవనంవారిపాలెం గ్రామాలలో మంగళవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.పార్టీ జెండాను ఆవిష్కరించి వైఎస్సార్ విగ్రహాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో నాయకులు కూసంపూడి దేవేంద్రరాజు, ఎంపీటీసీ సభ్యురాలు దొంతిరెడ్డి సింధు, కోటిరెడ్డి, కుంతం ప్రసన్న, సీతయ్య తదితరులు ఉన్నారు.

పేదల అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ ఆవిర్భావం

కర్లపాలెం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాల సాధనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీని స్థాపించారని ఎమ్మెల్యే కోన రఘుపతి చెప్పారు. కర్లపాలెం ఐలాండ్ సెంటర్లోని వైఎస్సార్ మార్కెట్ వద్ద మంగళవారం వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ 14వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్య అతిథిగా హాజరై నాయకులతో కలసి మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీని స్థాపించిన నాటి నుంచి ప్రజలతోనే ఉంటూ రాష్ట్రంలో 151 అసెంబ్లీ సీట్లు గెలుచుకుని చరిత్ర సృష్టించి ముఖ్యమంత్రి అయ్యారని అన్నారు. ఈ ఐదేళ్ళలో అర్హులందరికీ నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలను అందజేశారని కొనియాడారు. మండల పరిధిలోని పలు గ్రామాలలో మహానేత వైఎస్సార్ విగ్రహాలకు స్థానికంగా ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఎంపీపీ యారం వనజ, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల మహిళా అధ్యక్షురాలు పోతురాజు వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ పందర బోయిన సుబ్బారావు, సర్పంచ్‌లు అక్కల శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ ఎస్‌కె ఆసిఫ్ అలీ, వైఎస్సార్ సీపీ నాయకులు మందపాటి పరమానందకుమార్, ఆట్ల నాగేశ్వరరెడ్డి, పేరాల వెంకటసురేష్, దేవరకొండ రమేష్, ఆట్ల అయ్యప్పరెడ్డి, కంకిపాటి నాగరాజు, చీరాల సత్యనారాయణరెడ్డి, ఆట్ల అయ్యప్పరెడ్డి, ఆట్ల హరిబాబురెడ్డి, షేక్ తాజుద్దీన్, పి.నాగరాజురెడ్డి, కత్తి కిరణ్‌కుమార్, మార్పు బెనర్జి, జయభారత్‌రెడ్డి, తాతపూడి మనోహర్, షంషీర్, జానీ ఆట్ల నాగిరెడ్డి, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం ఆవిర్భవించిన పార్టీ వైఎస్సార్ సీపీ

పిట్టలవానిపాలెం: ప్రజల కోసం స్థాపించిన పార్టీ వైఎస్సార్ సీపీ అని బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఘాట్ సాక్షిగా వైఎస్సార్ సీపీని జగన్ మోహన్‌రెడ్డి స్థాపించడం జరిగిందని తెలిపారు. అయితే నాటి నుంచి 2019 వరకు అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. 2019 ఎన్నికలలో అధికారం చేపట్టిన నాటి నుంచి నవరత్నాల పేరుతో అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి అమలు చేసినట్లు గుర్తు చేశారు. తొలుత మండల కేంద్రంలోని మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ షేక్ బాజి, ఇన్‌చార్జ్ ఎంపీపీ దెందుదూరి సీతారామరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు వాలి శివారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు దోమ తిరుమలరెడ్డి, పార్టీ నాయకులు బొలగాని సుబ్బారావు, కుంతం ప్రసన్న, యోహాను, గుమ్మడి సీతయ్య, అలకాపురం గ్రామ సర్పంచ్ మంతెన గంగరాజు, దొంతిరెడ్డి కోటిరెడ్డి తదితరులు ఉన్నారు.



వేమూరులో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న వరికూటి అశోక్ బాబు

వైఎస్సార్ సీపీ ఆశయ సాధనకు కృషి చేద్దాం

బాపట్ల: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీని మళ్లీ అధికారంలోకి తెచ్చుకునేందుకు కృషి చేద్దామని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బాపట్ల పట్టణంలోని రథం బజారులో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి వేడుకలను కోన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజారంజక పాలన ఎలా ఉండాలో చేసి చూపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి తెచ్చుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజలకు నేరుగా సంక్షేమ కార్యక్రమాలను అందించిన మహోన్నతమైన వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. బాపట్ల జిల్లా పరిధిలోని మేదరమెట్లలో నిర్వహించిన సిద్ధం సభకు భారీ జన సందోహం తరలివచ్చిందని కోన చెప్పారు. బాపట్ల నియోజకవర్గం నుంచి 14 వేలకు పైగా అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, కాగిత సుధీర్‌బాబు, నాయకులు చేజర్ల నారాయణరెడ్డి, గొర్రెముచ్చు పుష్పరాజ్యం, చింతల రాజశేఖర్, షేక్.సయ్యద్ పీర్ కొక్కిలిగడ్డ చెంచయ్య, నర్రావుల వెంకట్రావు, జోగి రాజా, అడే చందు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాలే వైఎస్సార్ సీపీ లక్ష్యాలు



పెనుమూడిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మోపిదేవి వెంకట రమణారావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్, బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు
- రూ.4.72 కోట్లతో గ్రామాలలో అభివృద్ధి పనులకు ఈవూరితో కలిసి ప్రారంభోత్సవాలు



మహిళకు నివేసన స్థలం పట్టాను అందజేస్తున్న మోపిదేవి పక్కన డాక్టర్ ఈవూరి గణేష్

రేపల్లె రూరల్: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమాలే వైఎస్సార్ సీపీ అజెండాలోని ప్రధాన అంశాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. రేపల్లె మండలంలోని వివిధ గ్రామాలలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తండ్రి ఆశయాలను పుణికిపుచ్చుకున్న జగనన్న పేదలకు నిరంతరం అండగా నిలుస్తూ సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ మాట్లాడుతూ కనీవినీ ఎరుగని రీతిలో రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందన్నారు. పట్టణాలలో గానీ, గ్రామాలలో గానీ అభివృద్ధిని ప్రజల కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పెనుమూడిలో రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, చాట్రగడ్డలో రూ.45 లక్షలతో నిర్మించిన సచివాలయం, నల్లూరు నార్త్‌లో రూ.17 లక్షలతో నిర్మించిన హెల్త్‌కేర్ సెంటర్, కామరాజుగడ్డ నార్త్‌లో రూ.13 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, సింగుపాలెంలో రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, విశ్వేశ్వరంలో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, రిటైనింగ్ వాల్స్, చోడాయపాలెంలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులు, రిటైనింగ్ వాల్స్, పిరాట్లంకలో రూ.58 లక్షలతో నిర్మించిన ఎస్ఎల్ఆర్ బ్రిడ్జి, రాజుకాల్వలో రూ.1.7 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్డులు, కాంపౌండ్ వాల్స్, మోళ్లగుంటలో రూ.17లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, పైపులైన్, తుమ్మలలో రూ.12 లక్షలతో నిర్మించిన సీసీ రహదారి, కైతేపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులు, ఉప్పూడి ఊలుపాలెంలో రూ.102.50 లక్షలతో నిర్మించిన ఓహెచ్ఎస్ఆర్ పైప్‌లైన్‌లు, అరవపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులు, గుడ్డికాయలంక గ్రామంలో రూ.17.89 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులు వెరసి రూ.4.74 కోట్లతో నిర్మించిన అభివృద్ధి కార్యక్రమాలను ఎంపీ మోపిదేవి సమన్వయకర్త గణేష్‌తో కలిసి శిలాఫలకాలను ఆవిష్కరించి ప్రారంభించారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మండలి అంజయ్య, మండల ఉపాధ్యక్షులు పీతా వెంకటేశ్వరరావు, నాయకులు గరికపాటి భానుకోటి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు



పిట్టలవానిపాలెం: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి అన్నారు. పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేసే కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బాపట్ల నియోజకవర్గంలో 14,500 మందికి నివేశనా స్థలాలు అందించినట్లు తెలిపారు. ప్రతి పట్టాను ప్రభుత్వమే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ షేక్ బాజి, ఇన్‌చార్జ్ ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, గ్రామ సర్పంచ్ గౌరీదేవి విజయకుమారి మునీర, ఉపసర్పంచ్ చేబ్రోలు వీరయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ లీలా శ్రీనివాసరెడ్డి, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ కన్వీనర్ మండే విజయ్‌కుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై అత్యాచార యత్నం

పెదనందిపాడు(కాకుమాను): పెదనందిపాడులో మంగళవారం వేకువ జామున ఓ యువకుడు వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడి గాయపరచినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు(85)తన పనులు ముగించుకుని గాఢ నిద్రలో ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు వృద్ధురాలిని గాయపరచి అత్యాచారానికి పాల్పడడంతో వృద్ధురాలు కేకలు వేసింది. దీంతో యువకుడు పరారైనట్లు ఆయన తెలిపారు. వృద్ధురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్యాచారానికి యత్నించిన యువకుడిని మంజుగా గుర్తించి కేసు నమోదు చేసి వైద్య పరీక్షల నిమిత్తం వృద్ధురాలిని బాపట్ల ప్రజా వైద్యశాలకు పంపినట్లు ఎస్ఐ తెలిపారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ భాషా, ట్రైనీ డీఎస్పీ గీత, ప్రత్తిపాడు సీఐ నిసార్ భాష గ్రామంలో పర్యటించి పూర్తి వివరాలను సేకరించారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న సాయుధ బలగాలు



కర్లపాలెంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా మంగళవారం బాపట్ల పట్టణంలోని ఉప్పరపాలెం, డీఎంపల్లి తదితర ప్రాంతాల్లో బాపట్ల డీఎస్పీ సిహెచ్ మురళీకృష్ణ, బాపట్ల పట్టణ సీఐ యూ.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. రేపల్లె, అద్దంకి, పర్చూరు, చీరాల, వేమూరు పరిధిలో సైతం ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ ప్రజలకు భద్రత, భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి బాపట్ల జిల్లాలోని పలు ప్రాంతాల్లో పోలీసులు కవాతు నిర్వహించామన్నారు. ఎన్నికల్లో ప్రజలు వారి ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు.

కొల్లూరు : అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన శాంతి భద్రత చర్యలు చేపట్టనున్నట్లు కొల్లూరు ఎస్ఐ రవీంద్రరెడ్డి తెలిపారు. మంగళవారం కొల్లూరు ప్రధాన వీధుల్లో బీఎస్ఎఫ్, స్థానిక పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కొల్లూరు ఎస్సీ ప్రాంతం, గౌడపాలెం, బైపాస్‌రోడ్డు, లాక్ సెంటర్ ప్రాంతాల్లో పోలీసు కవాతు జరిపారు.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

కర్లపాలెం: శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకుంటామని ట్రైనీ డీఎస్పీ విద్యాశ్రీ,, బాపట్ల రూరల్ సీఐ హజరత్‌బాబు హెచ్చరించారు. త్వరలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా బాపట్ల రూరల్ సీఐ హజరత్ బాబు ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు, స్పెషల్ సెక్యూరిటీ ఫోర్స్‌తో మండలంలోని నల్లమోతువారిపాలెం, కొత్త నందాయపాలెం, పాతనందాయపాలెం, ఏట్రవారిపాలెం, కర్లపాలెం గ్రామాలలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం ఎస్ఐ జనార్థన్, పోలీస్ సిబ్బంది, బీఎస్ఎఫ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు వజ్రాయుధం

ఆర్డీవో గంధం రవీంద్ర



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో రవీంద్ర

బాపట్ల: ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని ఆర్డీవో గంధం రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న రౌండ్‌టేబుల్ సమావేశం కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 13న బుధవారం ఉదయం 11 గంటలకు బాపట్లలోని ఎన్జీ హోమ్‌లో జరిగే రౌండ్ టేబుల్ సమావేశం విజయవంతం చేయాలని కోరారు. ఓటు హక్కు ఒక వజ్రాయుధం లాంటిదని ప్రజలు ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కరపత్రం ఆవిష్కరణలో బాపట్ల ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్ష , కార్యదర్శులు డాక్టర్ సాయిబాబా, కోట వెంకటేశ్వర రెడ్డి, బాపట్ల తాసిల్దార్ శ్రావణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ బొజ్జ శ్రీకాంత్, కర్లపాలెం తాహసీల్దార్ బాబా, టీడీపీ నుంచి ఫరీద్ మస్తాన్, వైఎస్సార్ సీపీ నుంచి మాల్యాద్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి ఆట్ల బాలాజీరెడ్డి, బీజేపీ నుంచి కోట వెంకట రామకృష్ణ , సీపీఎం నుంచి నూతలపాటి కోటేశ్వరావు, కాంగ్రెస్ నుంచి రవి పాల్గొన్నారు.

ఆడబిడ్డను వేధించిన దోషులను కఠినంగా శిక్షించాలి



పాత మద్రాసు రోడ్డుపై బీసీ సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో

కోయవారిపాలెం (ప్రత్తిపాడు): ఆడబిడ్డపై సోషల్ మీడియా వేదికగా అమానుష దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బీసీ సంఘాలు, వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. జగనన్న ఇంటి పట్టా ఇచ్చారని సంతోషంగా మీడియాకు చెప్పిన తెనాలికి చెందిన గీతాంజలిని టీడీపీ, జనసేన మూకలు తమ సోషల్ మీడియా వేదికలపై విశృతంగా వేధించి, అసభ్యంగా దూషించి మానసిక క్షోభకు గురిచెయ్యడంతో ఆమె ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం మండల పరిధిలోని గుంటూరు–పర్చూరు పాతమద్రాసు రోడ్డుపై కోయవారిపాలెంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. గీతాంజలికి నివాళులర్పిస్తూ ఫ్లెక్సీలతో రోడ్డుపై రాస్తారోకో చేశారు. దోషులను వెంటనే శిక్షించాలి, ఉయ్ వాంట్ జస్టిస్, జోహార్ గీతాంజలి జోహార్ గీతాంజలి.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బీసీ సంఘాలకు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు తమ సంఘాభావం తెలిపి నిరసనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు జింకా వెంకటేశ్వర్లు, జాజుల శ్రీనాథ్, అప్పారావు, కొక్కెర బాజీ, వాసిమళ్ల రత్నబాబు, జొన్నలగడ్డ శ్రీకాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

భట్టిప్రోలు: వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్తగా వరికూటి అశోక్‌బాబు బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆయన కుటుంబ సభ్యులు సైతం ప్రచారంలో పాలు పంచుకుంటున్నారు. అశోక్‌బాబు సతీమణి లక్ష్మి, కుమారులు గౌతమ్, శ్రీ తేజస్‌లు నియోజకవర్గంలోని 5 మండలాల్లో ప్రతి గ్రామాన్ని జల్లెడ పడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళుతున్నారు. మంగళవారం భట్టిప్రోలు విఠలేశ్వరనగర్‌లోని చేనేతవాడ, ఇస్లాంపేటలను వరికూటి సతీమణి సందర్శించారు. స్థానిక కోదండ రామాలయంలో పూజలు నిర్వహించారు. చేనేత కార్మికులు, ముస్లిం మహిళల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను పరిష్కరించేందుకు తన వంతుగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఆమె వెంట ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి, మండల జేసీఎస్ కన్వీనర్ గోవర్ధనగిరి చినబుజ్జి, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు బండారు కుమారి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, ఎంపీటీసీ సభ్యులు కొతరపు పద్మావతి పాల్గొన్నారు.